# ప్రేమయే దైవము, దైవమే ప్రేమ

**అల్లాయంచు మహమ్మదీయులు జెహోవాయంచు సత్క్రైస్తవుల్**
**ఫుల్లాబ్జాక్షుడటంచు వైష్ణవులు శంభుండంచు శైవుల్ సదా**
**ఉల్లాసంబున గొల్వ నెల్లరను నాయుర్భోగభాగ్యాది సం**
**పల్లాభంబు లొసంగి రక్షించు దేవుండొక్కడే చూడుడీ!**

**నేను వెలుగులో నున్నాను నేనె వెలుగు**
**వెలుగు నాలోన నున్నది వెలుగు నేనె**
**అన్న భావము హృదయాన హత్తుకొన్న**
**అట్టి జ్ఞానియె బ్రహ్మలో ఐక్యమగును**

ప్రేమస్వరూపులారా!

'సత్యమ్ జ్ఞాన మనన్తమ్ బ్రహ్మ'. అన్నికాలములందు, అన్ని లోకములందు వుండగలిగిన అనంతమైన జ్ఞానమే బ్రహ్మ. అదే నిత్యం. అదే సత్యం. ఇట్టి బ్రహ్మను గుర్తించిన మానవునికి తెలియని పదార్థము మరొకటి వుండదు. జ్ఞాన, విజ్ఞాన సర్వస్వము అతనియొక్క సొత్తే! ఇట్టి దైవత్వమునుండియే శబ్ద స్వరూపమైన ఆకాశము వుదయించినది. ఈ ఆకాశమునుండియే వాయువు పుట్టినది. వాయువునుండి అగ్ని, అగ్నినుండి జలము, జలమునుండి పృథ్వికూడను ఆవిర్భవించినవి. ఈ పృథ్వినుండియే ఓషధులు, ఓషధులనుండి అన్నము, అన్నమునుండి పురుషుడు వుద్భవించాడు. ఏతావాతా బ్రహ్మకు, పురుషునకు సంబంధము అవిచ్ఛిన్నముగా కొనగుతూ వచ్చింది.

**జగత్తంతయు స్థూలరూపములో అన్నమయమే!**

పురుషుడు అన్నసార స్వరూపుడు. ఇతను కేవలము అన్నమయ స్వరూపుడే కాక

sri sathyasai vachanamrutam

స్థూలమయ స్వరూపుడుకూడను. ఈ స్థూల శరీరమునుండి సూక్ష్మమైన ప్రాణము మరింత సూక్ష్మముగా కనుపించుచున్నది. దీనికంటె సూక్ష్మమైనది మనస్సు. మనస్సుకంటె మరింత సూక్ష్మమైనది విజ్ఞానము. విజ్ఞానముకంటె సూక్ష్మమైనది ఆనందము. స్థూలమైన అన్నమయ శరీరమునుండి అతి సూక్ష్మమైన ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ జీవితములు ఆవిర్భవిస్తూవచ్చాయి. అన్నమనగా మనము భుజించు ఆహారము మాత్రమేకాదు. ప్రాణమయ పదార్థములన్నియు అన్నముగానే రూపొందుతున్నాయి. కనుక అన్నమే అన్నమయ స్వరూపకముగా రూపొందుతున్నది. భుజించువాడు, భుజింపబడునది అన్నమే. అన్నమే అన్నమును భుజించుచున్నది. ఒక ప్రాణి మరొక ప్రాణికి ఆహారముగా రూపొందుతున్నది. జగత్తంతయు స్థూలమైన రూపములో అన్నమయముగనే కనుపించుచున్నది. కనుకనే అన్నం బ్రహ్మ అనే తత్త్వాన్నికూడను నిరూపించారు, ఋషులు. ఇలాంటి అన్నమయమైన దేహతత్త్వాన్ని మనోమయరూపకముగా మార్చుకొని, విజ్ఞానమయములో ఆనందమును అనుభవించటమే మానవునియొక్క కర్తవ్యము.

**అన్నముతో ప్రారంభమైన మానవత్వము ఆనందముతో అంత్యము కావాలి**

ఈ విజ్ఞానము సర్వప్రాణులకు సమానమైనదికాదు. ఏకొంతమందికి మాత్రమే యీ విజ్ఞానము ప్రాప్తిస్తుంది. ప్రాణమయమైన పశుపక్షిమృగాదులందుకూడను యీ యొక్క మనోమయము వుండినప్పటికి వాటిలో విచారణశక్తి లేకపోవటంచేత అవి అట్టి పవిత్రమైన జ్ఞాన తత్త్వాన్ని పొందలేకపోతున్నాయి. నిత్యానిత్యపరిశీలన కోల్పోయి, తనయొక్క మంచిచెడ్డలనే విచారణశక్తి శూన్యమై, విచక్షణలేకపోవటంచేతనే పశుపక్షిమృగాదులందు యీ విధమైన విజ్ఞానము కనుపించలేకపోవుచున్నది. మంచిచెడ్డల విచారణశక్తిని, నిత్యానిత్య విషయ పరిశీలనను గావించువాడు ఒక్క మానవుడు మాత్రమే! అట్టి మానవుడే ఆనందమును పొందటానికి, అనుభవించటానికి అర్హుడౌతాడు. అన్నముతో ప్రారంభమైన మానవత్వము ఆనందముతో అంత్యము కావటమే దీనియొక్క ప్రధాన కర్తవ్యము. ఇదే మానవుని ప్రధాన లక్ష్యము.

sri sathyasai vachanamrutam

## మానవుడు ఉత్తమమైన భావములు, సత్ప్రవర్తన అలవరచుకోవాలి

ఆనంద నిమిత్తమై మానవుడు అనేక విధములైన ప్రయత్నములు సలుపుతున్నాడు. నిర్విరామ కృషిచే, నిరంతర తాపత్రయములచే, అంతులేని ఆశలచే, అర్థముకాని ఆవేదనచే, అప్రాప్యరూపమైన ప్రాప్తికి ప్రాకులాడుతూ అశాంతికి గురౌతున్నాడు, మానవుడు. ఆనందమును అనుభవించుటకు మానవునికి అధికారము వుండికూడను, దానికి తగిన ప్రయత్నము చేయలేక పోవటంచేతనే యిట్టి శాశ్వత ఆనందమును అనుభవించలేకపోతున్నాడు. ఆనందమే బ్రహ్మ! ఇదే దైవము. దీనికి ఏ పేరైనను పెట్టుకొనవచ్చును. కానీ, దేశకాల పరిస్థితుల ప్రభావమునకు గురై మానవుడు యథార్థ స్వరూపాన్ని విస్మరించి అనిత్యము, అశాశ్వతము, అసత్యమైన లోకస్వరూపాన్ని విశ్వసించి తనయొక్క జీవితమును వ్యర్థము గావించుకొనుచున్నాడు. మానవుడు తనయొక్క జీవితమును ఏవిధముగా అర్థము చేసుకున్నది తనయొక్క గుణములపైననూ, తనయొక్క భావములపైనను ఆధారపడివుంటుంటాది. ఏతావాతా ఒక దేశము, ఒక జాతికి చెందిన మానవునియొక్క ప్రవర్తన అతని గుణములపైననే వుంటుండాది. మానవునియొక్క ప్రవర్తన మంచిదైనప్పుడు, మానవుని భావములు ఉత్తమమైనప్పుడు, జాతిగాని, దేశముగానీ పవిత్రమైన, ఉత్తమమైన, ఆదర్శవంతమైన జీవితాన్ని అందిస్తుంది, అనుభవిస్తుంది. మానవుని నడతలు, భావములు వికృతమైనప్పుడు దేశముకూడను, జాతికూడను క్షీణించిపోతుంది. కనుక మానవుడు తనయందు వుత్తమమైన భావములు, పవిత్రమైన నడతలు అభివృద్ధిపరచుకోటానికి కృషి చెయ్యాలి.

## సర్వమతముల సారము, సర్వశాస్త్రముల మూలము, సర్వమార్గములయొక్క గమ్యము ఒక్కటే!

'మానవుడనగా నమ్మకము కల్గినవాడు', అని అర్థము. ఇది ఉపనిషద్ వాక్యము. తాను విశ్వసించిన విషయమును ఆచరణలో పెట్టినప్పుడే తన నమ్మకముకూడను అభివృద్ధి గాంచుతూ వస్తుంది. కానీ యీనాటి మానవునకు విశ్వాసమనేది కేవలము తాత్కాలికమైన రూపాన్ని ధరిస్తున్నాది. విశ్వసించిన దానిని ఆచరణలో పెట్టలేకపోతున్నాడు. కేవలము

srisathyasaivachanamrutam

మాటలచేతనే దానిని మరుగు చేసుకుంటున్నాడు. 'మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం, మహాత్మనం'. ఈ తత్త్వాన్ని అనుభవించినప్పుడే దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన భావతత్త్వాన్ని మనము అభివృద్ధి గావించుకోవచ్చును. ఇట్టి నిత్యమైన తత్త్వాన్ని గుర్తించుకున్నవాడు, ఏసు. సర్వమతములసారము, సర్వశాస్త్రముల మూలము, సర్వ మార్గములయొక్క గమ్యము ఒక్కటే అనే సత్యమును సర్వమతములు చాటుతూ వచ్చాయి. భారతీయులు నమస్కారమనే పవిత్రమైన చర్యతో ప్రారంభించారు. నమస్కారమనగా రెండు చేతులు జోడించి అన్నింటిని యేకము గావించునదే యీ నమస్కారము. అనేకత్వములోని ఏకత్వమును నిరూపించునదే నమస్కారము. ఇట్టి ఐక్యతే మానవునియొక్క ప్రధానమైన జీవిత కర్తవ్యమనికూడను నిరూపిస్తూ వచ్చింది. మహమ్మదీయులు 'సలాం, సలాం' అంటారు. 'స' అనగా దైవము. 'ల' అనగా ఐక్యము, లయము. దైవముతో ఏకము కావటమే సలాముయొక్క అర్థముగా నిరూపిస్తూ వచ్చారు. క్రిష్టియనులు 'ఏసు, ఏసు' అని పిలుస్తూవచ్చారు. 'ఏ' అనగా ఒకటి. 'సు' అనగా దైవము. 'దైవము ఒక్కటే', అనే సత్యాన్ని నిరూపిస్తూ వచ్చింది క్రైస్తవ మతము. ఏతావాతా సర్వమతములుకూడను ఏకత్వాన్ని బోధిస్తూ వచ్చాయి. 'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ'. రెండవది లేదు, వున్నది ఒక్కటే అనే సత్యాన్ని నిరూపిస్తూవచ్చింది. కానీ 'దేవుడు ఒక్కడే' అని నిరూపించే ఏసుతత్త్వమును అనేకమంది భిన్నఅర్థములుగా విభజించి 'ఏసు ఒక్కడే దైవము' అనే పెడర్థముగా భావిస్తూవస్తున్నారు. 'జీసస్ ఒక్కడే' అనే అర్థము అందులో లేదు. ఏసు అంటే ఒక్కడే దైవము. ఈ తత్త్వాన్ని విశాల దృష్టితో ప్రచారముచేసిన ఎంత పవిత్రమైన మార్గము అవలంబించటానికి అవకాశము వుంటుంటాది!

### ప్రతి మానవునికి విశాలమైన హృదయము అవసరము

There is only one GOD. ఎక్కడ చూచినప్పటికి ఒకే దైవము. రూపములు వేరుగా వుండవచ్చును, నామములు వేరుగా వుండవచ్చును. ఈనాడు ఎంత చదువులు చదివినప్పటికిని, ఎంత విజ్ఞానప్రజ్ఞానసుజ్ఞానములు సాధించినప్పటికి విశాలభావము మాత్రము క్షీణించి పోతూవుండాది.

sri sathyasaivachanamrutam

**చదువులన్నియు చదివి చాల వివేకియై**
**మగిడి తన్నెఱుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఏ రీతినున్నను**
**హీను డవగుణంబు మానలేడు**
**తరచి చదువు చదువ తర్కవాదమెగాని**
**పూర్ణ జ్ఞానంబెపుడు పొందలేడు**
**చదువులన్ని చదివి చావంగనేటికి**
**చావులేని చదువు చదువవలయు**

ఈనాడు ప్రతి మానవునికికూడను విశాలమైన హృదయము అత్యవసరము. విశాలప్రేమను పెంచుకోవాలి. సంకుచితమైన మార్గములో మనము ప్రవేశించరాదు. ఈ తత్త్వాన్ని జీసస్ అనేక విధములుగా విచారణ సల్పి, నిజ సత్యాన్ని గుర్తిస్తూ వచ్చాడు. జీసస్ కూడను ప్రప్రథమములో ద్వైతభావమునందే తన సహజభావాన్ని నిరూపిస్తూ I am the messenger of GOD అన్నాడు. తదుపరి కొంతకాలము విచారణ సల్పి, పరిశోధన సల్పి, I am the son of GOD అన్నాడు. క్రమేణా భగవంతుని సన్నిహిత సంబంధ బాంధవ్యమును తాను అనుభవిస్తూ వచ్చాడు. అప్పుడే పన్నెండు సంవత్సరములు ఎడారులలో సంచరించి, దైవత్వమునకు మానవత్వమునకు వుండిన సంబంధమును ఏకత్వముగా అనుభవించాక I and my Father are one అన్నాడు. అప్పుడే అతడు ప్రచార, ప్రబోధలు ప్రారంభించి 'నా జీవితము చాలా వుల్లాసముగా వుంటుండాది. Joyగా వుంటుండాది', అన్నాడు. అతనితో సంచరించు చున్నటువంటి పన్నెండుమంది భక్తులు అతని శిష్యులుగా చేరారు. అందులో మొదటివాడు పీటర్. ఇతనిని అనేక విధములుగా విశ్వసించి సన్నిహితముగా అతనితో అన్ని విధములుకూడను విడిగా మాట్లాడేవాడు. ఏ విధమైన రహస్యములేకుండా అతనికి తెల్పేవాడు. అందరిని ప్రేమించటమే ప్రధానమైన కర్తవ్యమని అన్నాడు. 'LOVE is GOD. Live in LOVE. దైవమే ప్రేమస్వరూపము, ప్రేమ ఫలితమును కోరేదికాదు. అడిగినవానికి అందించేదే ప్రేమ. అదే మానవుని లక్ష్యము. ఇట్టి ప్రేమతత్త్వముతో బ్రతికినప్పుడే మానవత్వము దివ్యత్వమును అనుభవిస్తుంది', అని

sri sathyasai vachanamrutam

బోధించాడు.

అప్పుడే పీటర్, జీసస్ Joyని వేరే అర్థముగా భావించుకొని దాన్ని స్మరిస్తూ వచ్చేవాడు. JOY అనగా J-Jesus is first; O-others are next; Y- myself is last అన్నాడు. JOY అనే దానిలో వున్న అంతరార్థమును చక్కగా గుర్తించాలి. అనగా తనకు తాను myself is last అన్నాడేగాని నిజముగా Y కి వున్న అర్థమేమిటి? Yourself is last. J-Jesus is first. O-Others are next. Y-Yourself is last అనగా ఎవరికి వారు 'నేను, నేను, నేను' అనేది యీనాడు 1stగా వుంటున్నారు. GOD అనేది last గా వుంటుండాది. యీనాడు మనము గుర్తించవలసినది దైవము 1st, ప్రకృతి next, జీవుడు last. అనగా తన తత్త్వమును తాను మరచినప్పుడే ప్రపంచమనే అద్దములో ప్రతిబింబమును తాను విస్మరించుకుంటాడు. తక్షణమే జీవత్వము ఏకమైపోతుంది.

**మానవులందరిది ఒకే జాతి; అదే మానవజాతి**

మానవత్వములో యిట్టి దివ్యత్వాన్ని ప్రబోధించే నిమిత్తమై సర్వ దేశములు, సర్వ మతములు, గమ్యాన్ని ఒక్కటిగానే బోధిస్తూ వచ్చారు. కానీ మానవత్వములో యిట్టి విశాలహృదయము దినదినమునకు క్షీణించిపోవటంచేత వారి భావములు మార్పు చెందుతూ వస్తున్నాయి. ఈనాడు ప్రేమనే ప్రధాన లక్ష్యముతో మనము అభివృద్ధి గావించుకోటానికి కృషి చెయ్యాలి. అందరూ ఒక్క ప్రభువుయొక్క బిడ్డలే! అందరి మతము ఒక్కటే! అందరి జాతి ఒక్కటే! అదే మానవజాతి. మనందరియొక్క మతము ప్రేమ తత్త్వమే! సర్వ మతముల సమ్మతమే మనయొక్క అభిమతమని భావించాలి. దీనినే ఒక వ్రతముగాకూడను విశ్వసించాలి. ఈ విధముగా మానవత్వాన్ని విశాలము గావించుకున్నప్పుడే పవిత్రమైన దివ్యత్వమును మనము అనుసరించటానికి అవకాశము వుంటుంది. కేవలము రూపమానవత్వమని మాత్రము యిది సత్యముగా మనము విశ్వసించరాదు. నేను మానవుడను, నేను మానవజాతికి సంబంధించిన వాడను. నాకు ఒక్కటే ఒక్క జాతి. నేను పవిత్రమైన దేశమునందు పుట్టినవాడను. నా దేశమేమిటి? పవిత్రమైన భారతదేశము. ఈ భారతదేశమునకు ఎల్లలు ఏమిటి? ఒక వైపున

sri sathyasaivachanamrutam

హిమాచలము. మూడువైపులా సముద్రము. ఇలాంటి హద్దులు గల దేశములో నేను వుండినవాడను.

**నిష్కామ కర్మ, నిర్మల భక్తి, అద్వైత జ్ఞానము-ఈ మూడు గుణములు భారతీయుల లక్షణము**

హిమాచలమనగా యేమిటి అర్థము? హిమము అనగా పవిత్రము. అనగా పరిశుద్ధముగా వుంటుండాది. దానియొక్క గుణము చల్లదనము. అది ప్రశాంతిని బోధించుచున్నది. కనుక, పవిత్రము, ప్రశాంతి, అచలము అనగా నిశ్చలముగా వుండేటువంటిది. అచలమనగా చలనము లేకుండా వుండేది. నిశ్చలము, నిర్మలము, ప్రశాంతి, నా యొక్క స్వభావము. ఈ గుణములే లేకపోయిన నేను భారతీయుడను కానే కాదు. ఈ భారతదేశములో గంగ, యమున, జ్ఞానతత్త్వమైన సరస్వతి, ఉపాంగములైన గోదావరి, కృష్ణ, కావేరి, సింధునదులంతా ప్రవహిస్తున్నాయి. నా పవిత్రమైన భారతదేశములో రక్తనాళములవలె గంగ, యమున, సరస్వతి ప్రవహిస్తూ వుంటున్నాయి. వీటికి అర్థములేకుండా పోలేదు. గంగ-యిది పవిత్రమైన నిష్కామకర్మకు చిహ్నము. యమున పవిత్రమైన భక్తికి చిహ్నము. గంగయందు నిర్మలము, నిశ్చలమైన పవిత్రము వుంటుండాది. ఇదే కర్మయోగము. ఫలాపేక్ష లేకుండా తాను పవిత్రమైన భావముతో సర్వులయందు దైవత్వమే వున్నదనే విశాలమైన హృదయముతో సేవలు సల్పటమే యీ కర్మకు సరైన గుర్తు. 'ఈశావాస్యమిదం సర్వం'. సర్వులయందు వుండిన భగవంతుడు ఒక్కడే అని ప్రేమతత్త్వముతో తన ప్రభావమును ప్రసరింపచేసినదే యమున. అదే భక్తి ప్రభావము. అదే భక్తికాండ. ఇంక సరస్వతి, జ్ఞానమును బోధించునది. కేవలము లౌకిక జ్ఞానమే కాదు. ఆధ్యాత్మిక తత్త్వములో ఆరని జ్యోతిని వెలిగించేటువంటిది. దీనినే 'అద్వైత దర్శనం జ్ఞానం', అన్నారు. 'ఆత్మదృష్టి కలిగినదే జ్ఞానము', అన్నారు. ఇందులో సుఖదుఃఖములుగానీ, పాపపుణ్యములుగానీ, మంచిచెడ్డలుకాని ఇటువంటి ద్వంద్వములకు యేమాత్రము అవకాశములేదు. ఇలాంటి జ్ఞానతత్త్వముతో కూడినదే సరస్వతీ ప్రవాహము. 'నిష్కామకర్మ నాచరించటము, నిర్మల భక్తితో పూజించటము, పవిత్రమైన ఏకత్వాన్ని గుర్తించటము యిది నాయొక్క ప్రథమ లక్ష్యము', అనే దృష్టిలో మనము వుండాలి.

sri sathyasai vachanamrutam

**లోకోద్ధరణకు నడుం కట్టిన ప్రతివ్యక్తి కష్ట, నష్టములకు నింద, నిష్ఠూరములకు గురికాక తప్పదు**

దేశమునకు, దేహమునకు సన్నిహిత సంబంధబాంధవ్యమున్నది. 'దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవస్సనాతనః', అనగా దేహము కేవలము సామాన్యమైనది, మానవ రూపమైనదని మనము భావించరాదు. ఇది దైవనివాసమైన పవిత్రమైన మందిరము. ఈ మందిరమును మనము యెంత పవిత్రముగా వుపయోగించుకోవాలో, ఎన్ని విధములుగా దానిని పరిశుద్ధముగా ఉంచుకోవాలో దానికి తగిన కృషిని మనము సల్పాలి. కేవలము స్వార్ధ నిమిత్తమై అందించబడినది కాదు, దేహము. 'పరోపకారార్థం మిదం శరీరం'. కనుక, ఈ దేహము నిమిత్తమై యితరులకు సేవ మనకు ప్రసాదింపబడినది. ఇటువంటి సేవయందే జీసస్ తన జీవిత కాలమునంతయు పవిత్రము గావించుకున్నాడు. కాల, కర్మ, కారణ, కర్తవ్యాలను గుర్తించాడు. తనను ఎంతమంది ఎన్ని విధాలుగా విరుద్ధమైన మార్గములలో భావించినప్పటికిని తాను యేమాత్రము సమత్వమునకు విరుద్ధముగా నడచుకోలేదు. లోకములో మంచి, చెడ్డలు వుండక తప్పదు. జీవితమనేది ఎండ, నీడలతో కూడినది. నీడ ప్రక్కనే ఎండకూడ వుంటుండాది. ఎండయే లేకుండిన నీడ కనుపించదు. ఎండకు అభావమే నీడ. లోకమును అభివృద్ధిలోకి తెచ్చిన ప్రతిమానవుడు యిట్టి కష్టములకు, నష్టములకు, నిష్ఠూరములకు నిందలకు గురికాక తప్పలేదు.

**సత్య, ధర్మములను నిలబెట్టేందుకు మానవుడు దేనినైనా త్యాగము చేయుటకు సిద్ధముగా ఉండాలి**

సత్యాన్ని, ధర్మాన్ని చాటేందుకు మానవుడు దేనినైనా త్యాగము చేయుటకు సిద్ధముగా వుండాలి. భగవత్ కార్యములందు యే విధమైన యోచన లేకుండా ప్రవేశించాలి. ఇట్టి పవిత్రమైన విశ్వాసమును మనము గాఢముగా అభివృద్ధి పరచుకోవాలి. 'దైవ విశ్వాసమే నా శ్వాస' అనే దానిని నీవు విశ్వసించాలి. అప్పుడే నీ కర్తవ్యమును గుర్తించినవాడౌతావు. శ్రీరాముడు అవతారమూర్తిగా వచ్చినప్పటికిని, కేవలము ఒక మానవునిగా తాను జీవించటానికి ప్రయత్నించినప్పటికిని, పితృవాక్యపరిపాలనే లక్ష్యమునందుంచుకొని

srisathyasaivachanamrutam

ప్రజాక్షేమమే తన దృష్టి యందుంచుకొని, ఎండ కన్నెరుగని సీతను వెంటబెట్టుకొని కఠినమైన అడవులలో తాను జీవించుచూ వచ్చినప్పటికిని, ఒక్కనాడైనా 'నాకు కష్టమే' అనే భావము తాను యేమాత్రము తలంచలేదు. సర్వ కష్టములు ఆనందముతో స్వాగతము చేస్తూ వచ్చాడు. ఇది దైవత్వముయొక్క ప్రధానమైన లక్షణము. మొట్టమొదట 'దేముడు' అంటే అర్థమేమిటి? అనగా కాలాతీతుడైన వాడు దైవము అని అర్థము. కనుక కాలాతీతమైన దైవత్వానికి యీ కర్మలు యేమాత్రము అడ్డము రావు. కర్తా తానే, భోక్తా తానే! అక్కడ యేమాత్రము విచారమునకు అవకాశము వుండదు. కర్తవ్యమును ఆదర్శముగా నిరూపించటమే వారియొక్క ప్రధానమైన కర్మ. అదే విధముగనే కష్టములయందు, నష్టములయందు, దుఃఖములయందు, విచారములయందు మనము యేమాత్రము కృంగటమో పొంగటమో చేయరాదు. రెండింటియందు వుండిన సమత్వమును మనము ఆనందముగా అనుభవించాలి. పాండవులు అనేక విధములైన మోసములకు లొంగి కష్టములు అనుభవిస్తూవచ్చారు. కానీ సత్య, ధర్మములకు తమ జీవితమంతా ధారపోస్తూ వచ్చారు. కనుకనే దైవము మెచ్చుకున్నాడు. సాక్షాత్తూ కృష్ణుడే వారి వెంట, జంట, యింట వున్నాడు.

**మంచివారు, మహనీయులు జగత్తుకొరకు కష్టములు, బాధలు అనుభవిస్తారు**

ఇట్టి సమత్వమును అనుసరించుటయే జీసస్ తనయొక్క కర్తవ్యముగా నిరూపిస్తూ వచ్చాడు. కట్టకడపటికి తన రక్తముకూడను దేశమునకై ధారపోశాడు. అనేకమంది భక్తులైనవారు యీ బాధను సహించుకొనలేక జీసస్‌ను హింసిస్తున్న ఆ దుర్మార్గులను దూషించటానికి పూనుకున్నప్పుడు, అశరీరవాణిగా తాను సరైన జవాబు వారికి అందించాడు. పీటర్‌వంటి జీసస్ భక్తులు కొందరు దీనిని భరించుకోలేకపోయారు. విరోధులను ఎదుర్కొనటానికి సంసిద్ధులయ్యారు. ఆ సమయములోకూడను జీసస్ All are one my dear son, be alike to every one అని వారికి బోధించాడు. జీసస్‌కు మొట్టమొదటి విరోధి, పాల్. ఒకనాడు యీ పాల్‌కు దైవము స్వప్నములో కనుపించి "పాల్! నీవు చాలా అజ్ఞానివి. జీసస్‌ను నీవు స్వార్థపరుడుగా భావిస్తున్నావు. జీసస్ లోకానికి ఏమి

srisathyasai vahinimutam

చేస్తున్నాడు? ఎవరికేమి మోసము చేశాడు? ఎవరికేమి కష్టములు కలిగించాడు? జీసస్ తన సర్వస్వమును ప్రజలకే ధారపోస్తున్నాడు. అలాంటి జీసస్‌ను నీవు దూషించటము పాపము" అని హెచ్చరించాడు. జీసస్‌వంటి మంచివారికి యిలాంటివే జరుగుతుంటాయి, ఎప్పుడుకూడను. కాచిన చెట్లకే రాళ్ల దెబ్బలు. కనుకనే భారతీయులు పవిత్రమైన గ్రంథములయందు సజ్జనులను చెఱకుగడగా, గంధపు చెక్కగా పోలుస్తూ వచ్చారు. చెఱకుగడయందు తీయని రసము వుంటుండాది. కానీ ఆ రసము మనకు లభించాలంటే చెఱకును చాలా పిప్పి కొట్టాలి. దానిని బాధించక దానిలో వున్న మాధుర్యము మనకు లభ్యముకాదు. అదేవిధముగా మంచివారలంతా చెఱకుగడలవంటివారు. ఈ మహనీయులయందు మధురమైన, దివ్యమైన రసము వుంటున్నాది. ఆ రసమును జగత్తునకంతా పంచిపెట్టటానికి వారు కొన్ని శ్రమలు పడవలసి వస్తుంది. కొన్ని కష్టములకు, నష్టములకు, నిష్ఠూరములకుకూడను గురికావలసి వస్తుంది. ఇదంతయు మేలుకోసమే! గంధము చెక్క. దానిని రాతిపైన వేసి నూరి నూరి నూరేంతవరకు చక్కని సుగంధమును అందిస్తూనే వుంటుంది. జగత్తునందు పవిత్రమైన వ్యక్తులకు యిలాంటి కష్టములు, బాధలు తప్పవు ప్రతి మానవుడు ఆదర్శవంతమైన జీవితమును గడపాలి. ప్రతి వ్యక్తికూడను తనను తాను భగవంతుని మెసెంజర్‌గా భావించాలి. తాము ఆయన అంశముగానే విశ్వసించాలి.

**సర్వత్రా ఉన్న భగవంతుని వెతికేదెక్కడ?**

విశ్వమంతా విష్ణుస్వరూపముగా భావించాలి. అప్పుడే మనము చెడ్డను దూరము చేసి, మంచిని అభివృద్ధి పరచటానికి తగిన శక్తి సామర్థ్యములు కల్గిన వారమవుతాము. ఈ విధమైన శక్తి, సామర్థ్యములు సంపాదించవలెనంటే భగవంతుని ప్రేమను మనము ప్రధానముగా పొందాలి. అనేకమంది అనేక విధములుగా భావించవచ్చును. 'నేను ఎన్నో సంవత్సరములనుండి భగవంతుని నిమిత్తమై ఎన్నో సాధనలు చేస్తున్నాను, ఎన్నో యాత్రలు చేశాను. కాని, భగవంతుడు నాకు కనుపించలేద'నుకుంటారు. భగవంతుని వెతికేవారు, అన్వేషణ సల్పేవారు కోట్లమంది ప్రజలు కనిపిస్తున్నారు. కాని యిది ఒక పెద్ద వెఱ్ఱితనముగా

sri sathyasaivachanamrutam

కనుపిస్తున్నాది. ఎక్కడ చూచినా వుండే భగవంతుని వెతికేదెక్కడ? చాలా పొరపాటు పడుతున్నారు. 'సాధకులు భగవంతుని వెతుకుతున్నారా లేక భగవంతుడే సాధకుని వెతుకుతున్నాడా', అని గుర్తించాలి. సర్వత్ర వుండిన దైవమును వెతుకుటకు ప్రయత్నించనక్కరలేదు. కానీ, సరైన భక్తుడు మాత్రము ఎక్కడా కనుపించటంలేదు. సంపూర్ణ శరణాగతుడైన భక్తుడు యీ లోకములో కనుపించటము లేదు. సరైన భక్తుని నిమిత్తమై భగవంతుడు వెతుకుతున్నాడే గానీ, భక్తులు వెతకనక్కరలేదు. 'సర్వతః పాణిపాదం తత్ సర్వతోక్షి శిరోముఖం'. ఎక్కడ చూచినా వుంటున్నాడు. ఇంటా జంటా కంటా వుండి, కంటికి రెప్పవలె కాపాడుతున్నాడు. యీ విశాలతత్త్వమును మీరు గుర్తించుకుంటే భగవంతుని వెతకటానికి మీరు యేమాత్రము ప్రయత్నించరు. తాను లేని స్థానము, తనది కాని రూపము యీ జగత్తులో కానరాదు. ఈ విశ్వాసమును మనము బలపరచుకోవాలి. ఇదే సరైన భక్తికి లక్షణము. ఏదో ధ్యానములు, పూజలు, యోగములు చేయటము సత్కర్మలక్రింద పరిగణించవచ్చును. కాలమును పవిత్రము గావించుకొనే కర్మలే యివన్నీ! కానీ సృష్టికర్తను గుర్తించుకునే మార్గము, విశాలమైన ప్రేమ తప్ప అన్య మార్గము లేదు. కనుక, 'ప్రేమయే దైవము, దైవమే ప్రేమ'. ఇటువంటి ప్రేమను మనము అభివృద్ధి పరచుకొని దైవత్వమును యెక్కడ చూచినా వున్నాడనే విశ్వాసముతో ధ్యానిస్తూ వుంటే యెక్కడికక్కడే కనుపిస్తాడు.

**'యద్భావం తద్భవతి'**

భాగవతమునందు ప్రహ్లాద చరిత్రలోపల దుర్మార్గుడైన తండ్రి భగవంతుని కొరకు సర్వత్ర వెతికాడు. హిరణ్యకశిపుడు మహా విజ్ఞాని. ఇతను వైజ్ఞానులందరికంటె చాలా గొప్పవాడు. సముద్రమును శోధించాడు. ఆకాశములో పక్షివలె సంచరించాడు. అణువణువునందుకూడను తాను పరీక్ష సలుపుతూ వచ్చాడు. అడుగడుగునకూడను విచారణ చేస్తూ వచ్చాడు. ఎక్కడా దైవత్వము అతనికి కనుపించలేదు. కారణం, తనలో దేవుడు లేడులేడు అనే భావముతో వెతకటంచేత తాను లేకుండా కనుపించాడు. ఎక్కడ చూచినా దైవము వున్నాడనే విశ్వాసముచేత ప్రహ్లాదునికి ఎక్కడ చూచినా దైవముగానే

srisathyasaivachanamrutam

కనుపించాడు. 'యద్భావం తద్భవతి'. తండ్రి అడిగాడు, ఎక్కడరా దైవమని? 'ఇందుగలడందులేడను సందేహము వలద'న్నాడు. 'అయితే, యీ స్తంభములో వుంటున్నాడా, నిరూపించమ'న్నాడు. 'తండ్రీ! ఒక్క స్తంభమేకాదు, ఎక్కడచూచినా తానులేని స్థలమే లేద'న్నాడు. ఆ స్తంభమును బ్రద్దలు కొట్టాడు, హిరణ్యకశిపుడు. తక్షణమే అందులో భగవంతుడు ప్రత్యక్షమయ్యాడు. దీని అంతరార్థమేమిటి? దేహమే ఒక స్తంభము వంటిది. ఇందులో దైవత్వమనేది చైతన్యస్వరూపములో ఉండి సర్వత్ర సర్వకార్యములు ఆచరిస్తున్నాడు. కన్నులతో చూచేది తానే, చెవులతో వినేది తానే, నాలుకతో రుచి చూచేదీ తానే, మాట్లాడేది తానే సర్వమూ తానే! కనుక, ఆ దేహభ్రాంతిని బ్రద్దలు చేసేటప్పటికి దైవస్వరూపము ప్రత్యక్షమయ్యింది.

**దేహభ్రాంతి ఉండినంతవరకు దైవభ్రాంతి అభివృద్ధికాదు'**

కనుక, దేహభ్రాంతి వుండినంతవరకు దైవభ్రాంతి మనకు అభివృద్ధి కాదు. ఇదీ భ్రాంతే, అదీ భ్రాంతే! భ్రాంతి వుండినంతవరకు బ్రహ్మ మనకు ప్రాప్తించదు. కనుక, దేహభ్రాంతిని కొంతవరకు తగ్గించుకుంటూ రావాలి. దైవముయొక్క ఆపేక్షను పెంచుకుంటూ పోవాలి. మన ప్రేమనంతా దైవమునకు అంకితము చేయాలి. కనుకనే

**త్వమేవ మాతాచ పితాత్వమేవ**
**త్వమేవ బంధుశ్చ సఖాత్వమేవ**
**త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ**
**త్వమేవ సర్వం మమ దేవదేవ**

ఈ తత్త్వమును మనము యేనాడు అభివృద్ధి గావించుకుందుమో, దృఢమైన రీతిగా నిర్ణయము చేసుకుందుమో అప్పుడే మనకు ఆనందము లభ్యమవుతుంది. మనసు నిండుకు యేవో సందేహములు పెట్టుకొని యీ సందేహములచే జీవితమును వ్యర్థము చేసుకుంటూ కడపటికి అనుభవించేదానినికూడను అనుభవించలేకపోతున్నాము. చిక్కినదానినికూడను దక్కించుకోలేక పోతున్నాము. కనుక, చిక్కినదానిని అనుభవించటానికి తగిన కృషి చెయ్యాలి. విరోధులనుకూడను మనము ప్రేమిస్తూ పోవాలి. వారిని తప్పక తగిన



sri sathyasai vahini / vachanamrutam

మార్గములో మలచుకోటానికి వీలవుతుంది. ప్రేమ యెంతటి శక్తినైనను చేరుస్తూ వస్తుంది. సమత్వమును, సమైక్యతను చేకూరుస్తుంది.

**ప్రేమముందు విరోధముకూడా యేమాత్రము పనిచేయదు**

ఒకానొక సమయములోపల బుద్ధుడు ఎక్కడికో ప్రయాణమై వెడుతున్నాడు. ఒక రాక్షసి మధ్య మార్గములో అతనిని పట్టుకుంది. 'నిన్ను యిప్పుడు చంపి భుజిస్తాన'ంది. బుద్ధుడు చిరునవ్వుతో 'ఓ దైవమా! నీవు దయ్యముకాదు, నిన్ను దైవముగా భావిస్తున్నాను. నిన్నుకూడా ప్రేమిస్తున్నాను' అన్నాడు. హృదయపూర్వకముగా బుద్ధుడు చెప్పిన ఈ మాటచేత ఆ దయ్యము మార్పుచెంది శాంతికి చిహ్నముగా పావురమై ఎగిరి వెళ్లిపోయింది. అనగా ప్రేమముందు విరోధముకూడను యేమాత్రము పని చేయలేదు. కనుక, మనము ఎవరినైనా ప్రేమిస్తూ పోయినప్పుడు ఎంతటి విరోధియైనకూడ మనపై కక్ష సాధించలేడు. కనుక, మనమందరము సమైక్యత నభివృద్ధిపరచుకోవాలి. సమత్వాన్ని సాధించాలి. దివ్యత్వాన్ని పోషించుకోవాలి. అదే మానవుని ప్రధాన లక్ష్యము.

**అన్ని మతములుకూడను సత్యమును, ధర్మమునే బోధిస్తున్నాయి**

క్రిష్టియన్స్ అని, ముస్లిములని, హిందువులని, బుద్ధులని, జోరాష్ట్రియన్లని యింకా అనేక రకాల పేర్లున్నాయి. కాని, మనము యేమాత్రము ఇటువంటి భేదములు పెట్టుకొనరాదు. అన్ని మతములుకూడను సత్యమును, ధర్మమునే బోధిస్తూ వస్తున్నాయి. ఈనాడు మనము చేసే సామూహిక భజనలన్నీ పంజాబులోని ఒక మహావీరునివలననే ప్రారంభమైనాయి. ఒక్కొక్క వ్యక్తి భగవంతుని ప్రార్థిస్తూ వస్తుంటే యిది కేవలం స్వార్థమని సామూహిక ప్రార్థనలు జరిపినప్పుడు దైవత్వంలోపల యేకత్వం యేర్పడుతుందని గురునానక్ సామూహిక భజనలు ప్రారంభిస్తూ వచ్చాడు. అందరూ ఏక కంఠముతో ఒక్కతూరి భగవంతుని ప్రార్థించినప్పుడు ఎంత పవిత్రమైన vibrations అభివృద్ధి పొందుతాయి. ప్రతీ మతమునందు మనము చక్కగా విచారిస్తే అన్నీ సుబోధలే చేస్తూ వచ్చాయి. ముఖ్యముగా జాతి, మత, భేదములను త్యజించి, యివన్నీ భ్రమలుగా భావించి మన జాతి ఒక్కటే, అదే



sri sathyasai vachanamrutam

మానవ జాతి అని విశ్వసించాలి. దేశములు వేరుకావచ్చును, భాషలు వేరు కావచ్చును, వేషములు వేరు కావచ్చును, కానీ హృదయములు ఒక్కటే. ఆ హృదయస్థాయియందున్న పరమాత్మయందు లక్ష్యాన్ని మనము అభివృద్ధి పరచుకోవాలి

**శృంగాములు వేరు బంగారమొక్కటే**
**పశుల వన్నెలు వేరు పాలు ఒక్కటె**
**జీవ జంతువులు వేరు జీవుండు ఒక్కడె**
**జాతి నీతులు వేరు జన్మమొక్కటె**
**పూల జాతులు వేరు పూజ ఒకటె**
**తెలివి లేకను మానవుల్ తెలివితప్పి**
**బ్రతుకుకోసము బహుబంధ బద్ధులైరి**

ఈ బ్రతుకు కోసము యిన్ని విధములైన మార్గములు అవలంబిస్తూ వచ్చారు. ఏమిటి యీ బ్రతుకు? దైవముతో బ్రతికే బ్రతుకు ఒక్కటే బ్రతుకు, దైవములేని బ్రతుకు, బ్రతుకే కాదు. అదొక గతుకు. కనుక, ఆ విశ్వాసమును మనము పెంచుకోవాలి. అప్పుడే దేశమంతాకూడను ఎంతైనా శాంతిని పొందగలదు. ఈనాడు దేశములో శాంతి, భద్రతలు ఏమాత్రం కన్పించటంలేదు. దీనికి కారణం మనమే! మన నడతలు, మన గుణములు పవిత్రముగా మార్చుకున్నప్పుడు దేశముకూడను పవిత్రంగానే వుంటుంది.

కనుక, మన జీవితాన్ని ఒక పవిత్రమైన ఆదర్శముగా మీరు విశ్వసించాలి. కేవలం మల, మూత్ర, దుర్గంధ, మాంస, రక్తములతోకూడిన దేహముగా విశ్వసించరాదు. మీది ప్రేమ స్వరూపమే! ఎప్పుడూ మీరు దీనిని స్మరిస్తూ వుండండి!

Love is my form    Truth is my breath
Bliss is my life
My life is my message    Expansion is my life
No reason for Love    No season for Love
No birth no death

**(తేదీ 25-12-1986న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam